క్లుప్తంగా

ఉత్తమ ప్రతిభకు పురస్కారాలు



పురస్కారాలు స్వీకరిస్తున్న వినీల, నరేశ్

కోరుట్ల: అధ్యాపక, సంగీత రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోరుట్ల డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల నరేశ్, సంగీతం మాస్టర్ శివపురం వినీలకు జాతీయ యువజన వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం ప్రేరణ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందించారు. కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, డా.ప్రభాకర్, ప్రేరణ సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు తిరునగరి రమణ, ప్రతినిధులు డీఎస్ చారి, మోటూరి రమేశ్, పండిత్ మహేశ్, పిస్క వేణు, యతిరాజం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిన్నంశెట్టి కళాక్షేత్రం ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన పేరిణి నృత్యం ఆకట్టుకుంది.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విద్యార్థినికి బెల్ట్ ప్రదానం చేస్తున్న డీఎస్పీ

మెట్‌పల్లి: ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతోందని డీఎస్పీ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సూర్యోదయ హైస్కూల్‌లో శనివారం జపాన్ కరాటే దోటు ఫెడరేషన్ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఇందులో 55 మంది విద్యార్థులు పాల్గొనగా, 11మంది బ్లాక్ బెల్ట్ సాధించారు. అనంతరం డీఎస్పీ చేతుల మీదుగా బెల్ట్‌లు ప్రదానం చేశారు. చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ అవినాష్, చెర్లపల్లి అరుణ్, సురిగి శ్రీనివాస్ తదితరులున్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

మేడిపల్లి: బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు అంకం సాగర్ తల్లి శనివారం మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఏనుగు మనోహర్ రెడ్డి, లోక బాపురెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం కొండాపూర్‌లోని శివగంగను సందర్శించారు.

సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర కీలకం

మేడిపల్లి: సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఎస్సై శ్యామ్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఉమ్మడి మేడిపల్లి మండల ప్రెస్‌క్లబ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నోముల నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు మార్గం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను కాపాడాలి

కోరుట్ల: దేశ సంస్కృతి, వారసత్వ సంపదను కాపాడాలని రాష్ట్రీయ స్వయం సేవక్ ప్రధాన వక్త గోనె భూమయ్య అన్నారు. శనివారం పట్టణంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవం నిర్వహించారు. నగర కార్యవాహ గట్ల ప్రవీణ్, జిల్లా సహ వ్యవస్థ ప్రముఖ్ గట్ల శివకుమార్, తనుగుల రాజశేఖర్ పాల్గొన్నారు.

జియోట్యాగింగ్ అవసరం లేదు

మెట్‌పల్లి: వ్యవసాయ పంపుసెట్లకు జియోట్యాగింగ్ అవసరం లేదని విద్యుత్ డీఈ తిరుపతి తెలిపారు. కేవలం 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను మాత్రమే అనుసంధానం చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

క్రైం కార్నర్..

ఇసుక డంపులు పట్టివేత

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మకూర్ శివారులో సుమారు 10 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపును రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేశారు.

వృద్ధురాలి అదృశ్యం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలో శుక్రవారం బోదాసు ఎల్లవ్వ (75) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. సారంగాపూర్ మండలం రంగపేటకు చెందిన ఎల్లవ్వ బ్యాంక్ పని నిమిత్తం జగిత్యాలకు వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె కుమారుడు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోరుట్ల: పట్టణ శివారులోని శ్రీసిద్ధివినాయక కళా ఆర్ట్స్‌లో శనివారం సాయంత్రం పేకాట ఆడుతున్న 12 మందిని పోలీసులు పట్టుకున్నారు. రూ.39,360 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఆలయ ఈవోకు ఫిర్యాదు

కొండగట్టు: కొండగట్టు అంజన్న ఆలయం వద్ద ఓ టెండర్‌దారుడు ఒక టెంకాయ రూ.25కి విక్రయించాల్సి ఉండగా, రూ.40కి విక్రయించాడని వీహెచ్‌పీ మల్యాల మండల అధ్యక్షుడు యాగండ్ల లక్ష్మీనారాయణ, కార్యదర్శి బొద్దుల మహేందర్ ఈవో వెంకటేశ్‌కు ఫిర్యాదు చేశారు.



మెట్‌పల్లి: కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



మల్లాపూర్: కల్యాణోత్సవంలో అర్చకులు, భక్తులు

కల్యాణ వైభోగమే..

కోరుట్లరూరల్/మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం: కోరుట్ల మండలం వెంకటాపూర్ శివారులోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో శనివారం గోదాదేవి రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. కన్యాదాతగా ఏఎంసీ మాజీ చైర్మన్ బోయినిపెల్లి సత్యంరావు దంపతులు వ్యవహరించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సర్పంచ్ తోట శారద, ఆలయ చైర్మన్ కటుకం రాజేశ్, కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, పట్టణ, మండల అధ్యక్షులు గంగాధర్, కొంతం రాజం, ఆలయ ఈవో విక్రం పాల్గొన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని శ్రీవేంకటేశ్వరాలయం, మెట్లచిట్టాపూర్ గ్రామంలో గోదారంగనాథుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహాజన్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. మల్లాపూర్ మండలం వెంకట్రావ్‌పేట, మొగిలిపేట గ్రామాల్లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌లు వనతడుపుల నాగరాజు, జోగుల మమత, ఎంపీటీసీలు తోట సుజాత, ఓస సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరసామి ఆలయంలో నిర్వహించిన గోదాదేవి కల్యాణోత్సవంలో సర్పంచ్ నేరెళ్ల హైమలత, మాజీ ఎంపీపీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కల్వర్టును పరిశీలిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మద్దులపల్లి గ్రామంలోని ఒర్రెపై ఉన్న కల్వర్టు ఇటీవల వర్షాలకు తెగింది. ఈ మేరకు తెగిన కల్వర్టును శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కల్వర్టుకు మరమ్మతులు కాకుండా శాశ్వత నిర్మాణ పనులు చేపట్టి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని పేర్కొన్నారు. సంబంధిత ఈఈతో మాట్లాడి కల్వర్టు నిర్మాణం కోసం ప్రతిపాదన పంపాలని ఆదేశించారు. విప్ వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, బతికపల్లి సర్పంచ్ శోభారాణి, నాయకులు బలరామ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, స్వామి, భాస్కర్, బీరయ్య, అనిల్, విష్ణు, తిరుపతి ఉన్నారు.

మా వారసులకు ఉద్యోగాలు కల్పించండి

బుగ్గారం: తమ వారసులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ మండలంలోని పలువురు వీఆర్‌ఏలు విప్ లక్ష్మణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వీఆర్‌ఏల సర్దుబాటు కోసం గత ప్రభుత్వ జీవో ప్రకారం తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విప్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంకూస్, అశోక్, మూగల నర్సయ్య, పడాల నర్సయ్య, మోహన్, తిరుపతి, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు



కథలాపూర్: శోభాయాత్రగా వెళ్తున్న మహిళలు

కోరుట్లరూరల్/ధర్మపురి/కథలాపూర్: కోరుట్ల మండలం సంగెం గ్రామంలో శనివారం అయోధ్య శ్రీరాముని అక్షింతలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దేవయ్య, రణధీర్, జలేందర్, మారుతి, మహేశ్ పాల్గొన్నారు. ధర్మపురి మండలం జైనా లోని బోయవాడలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. కథలాపూర్ మండలం చింతకుంటలో అక్షింతలు పంపిణీ చేసి జైశ్రీరామ్ అంటూ భక్తులు ఊరేగింపు చేశారు. జెడ్పీటీసీ నాగం భూమయ్య పాల్గొన్నారు.

ఘనంగా మెల్విన్ జోన్స్ జయంతి



నివాళి అర్పిస్తున్న క్లబ్ బాధ్యులు

కోరుట్లటౌన్: పట్టణంలోని మాదాపూర్ క్రాస్‌రోడ్ జాతీయ రహదారి వద్ద లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. లయన్స్‌క్లబ్ పట్టణ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, క్లబ్ ప్రతినిధులు మెల్విన్‌జోన్స్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లయన్స్ క్లబ్ కోటి నవదుర్గ మహిళా ప్రతినిధుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: మెల్విన్ జోన్స్ జయంతిని రాయికల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెడ్పీ కాటిపల్లి రాంరెడ్డి సహకారంతో 10 మంది నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు

మల్లాపూర్: మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్, అధ్యక్షుడు కనక సంజీవ్ అధ్యక్షతన పేదలకు పండ్లు, బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. క్యాతం సురేశ్‌రెడ్డి, ముత్యాల రమేశ్, మోర సతీశ్, గుడూరి నవీన్‌కుమార్, బెజ్జారపు ధనుశ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు



చౌలమద్దిలో ముగ్గులు వేస్తున్న యువతులు

మెట్‌పల్లిరూరల్/బుగ్గారం/సారంగాపూర్: మెట్‌పల్లి మండలం చౌలమద్ది గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ఓ కంపెనీకి చెందిన వారు ముగ్గుల పోటీలు నిర్వహించగా మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి బహుమతి సింధూజ, రెండో బహుమతి సౌమ్య, మూడో బహుమతి సాత్విక అందుకున్నారు. సర్పంచ్ లింగారెడ్డి, కంపెనీ ప్రతినిధులు దీక్షిత్, ధనుంజయ్, చందు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. బుగ్గారం మండలం చందయ్యపల్లిలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు ఎస్సై సందీప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిభ కనబర్చిన ముగ్గురికి బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, నాయకులు ఎన్నం కిషన్‌రెడ్డి, గాదె శంకర్, ప్రభాకర్, గట్టు గంగయ్య, చల్ల తిరుపతి పాల్గొన్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

బహ్రెయిన్‌లో సంక్రాంతి సంబరాలు





జగిత్యాలరూరల్: సంక్రాంతి పండుగను ప్రపంచదేశాల్లో ఉన్న తెలుగు వారు ఘనంగా జరుపుకుంటున్నారు. శనివారం బహ్రెయిన్‌లోని తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలుగువారు, అతిథులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటుదాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందామని కార్యకర్తలు చింతించకుండా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుదామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన బీఆర్‌ఎస్ ప్రధాన కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవిద్దామని, ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. పార్టీని నమ్ముకుని పని చేస్తున్న ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఎంపీపీ శోభ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకన్న, వైస్ ఎంపీపీ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

మస్కట్‌లో గుండెపోటుతో కోరుట్ల వాసి మృతి



ప్రమోద్‌కుమార్(ఫైల్)

కోరుట్ల: ఉపాధివేటలో వలస కార్మికుడు మృతిచెందిన ఘటన విషాదం నింపింది. కోరుట్ల పట్టణానికి చెందిన వెల్దుర్తి ప్రమోద్‌కుమార్ (34) మస్కట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం విధులకు సెలవు కావడంతో తన గదిలోనే విశ్రాంతి తీసుకున్నాడు. స్నేహితులు ఎంత పిలిచినా గది తలుపు తీయలేదు. డోర్ పగులగొట్టి లోపలికి వెళ్లి పరిశీలించగా నేలపై పడి ఉన్నాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుతోనే చనిపోయినట్లు తెలిపారు. ప్రమోద్‌కు తొమ్మిదేళ్ల కూతురు, ఐదేళ్ల కొడుకు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గల్ఫ్ ప్రవాసీ కార్మికులు కోరుతున్నారు.

క్లుప్తంగా..

విచారణ జరిపించాలి

మెట్‌పల్లి: ఖాదీ ప్రతిష్టాన్‌లో అవకతవకలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్ డిమాండ్ చేశారు.ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పార్టీలకు ఆపాదించవద్దు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని కొండ్రికర్లలో ఇటీవల కొందరు వ్యక్తుల మధ్య జరిగిన వివాదాన్ని రాజకీయ పార్టీలకు ఆపాదించవద్దని ఎంపీపీ సాయిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు.

మొక్కు చెల్లించుకున్న కాంగ్రెస్ నాయకులు

కొండగట్టు: చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యేగా మేడిపెల్లి సత్యం గెలిచిన సందర్భంగా డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన పుండ్ర మధు, బైరీ సంజీవ్ కొండగట్టు అంజన్నకు తలనీలాలు సమర్పించారు.

దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

పెగడపల్లి: దొంగతనాల నివారణ, ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్‌శాఖ ముద్రించిన కరపత్రాలను శనివారం ఎస్సై సతీశ్ పెగడపల్లిలో పంపిణీ చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

మల్యాల: పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని తెలంగాణ జాతిపిత కేసీఆర్ అన్ని రంగాల్లో తీర్చిదిద్దారని, అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలతో కార్యకర్తలు అధైర్యపడవద్దని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. శనివారం నూకపల్లి పాక్స్ చైర్మన్ బోయినపల్లి మధుసూదన్‌రావు తండ్రికి శస్త్రచికిత్స కాగా, ఆయనను మద్దుట్లలో పరామర్శించారు.



ఏటా వచ్చే సంక్రాంతికి పండుగల్లో ప్రత్యేక స్థానం ఉంది. మూడు రోజుల ముచ్చటైన పండుగలో సకినాలు ఎంత స్పెషలో.. గాలిపటాల ఆటా అంతే. పాఠశాలలకు సెలవులు మొదలైతే చాలు.. చిన్నారుల్లో ఎక్కడాలేని ఆనందం.. దబ్బాకు దారం.. చేతిలో పతంగి ఉంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు వారికి మరో ధ్యాస ఉండదు. నేలపై నిలుచున్నా.. చూపు మాత్రం ఆకాశంవైపే.. రంగురంగుల పతంగుల విహంగనం.. గగన వీధుల్లో పగటి నక్షత్రాలను మరిపిస్తుంది.

గాలిపటం



- 'పగటి నక్షత్రాల' సందడి షురూ
- వీధివీధినా పతంగుల సంబరం
- ఆటలో అప్రమత్తత అవసరం
- జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం

కరీంనగర్/సప్తగిరి కాలనీ(కరీంనగర్)/సిరిసిల్ల టౌన్/కోల్‌సిటీ/గోదావరిఖని టౌన్(రామగుండం)/జగిత్యాల/గొల్లపల్లి(ధర్మపురి)/జగిత్యాల టౌన్: పతంగుల పండుగ నిజాం కాలంలో గొప్ప ఆదరణ పొందింది. దీని పుట్టుక ఆసక్తికరమే. సముద్ర తీర ప్రాంతాలు, మైదానాలు, ఎడారుల్లో గాలి తీవ్రతను.. వాటాన్ని తెలుసుకునేందుకు ఆ రోజుల్లో తేలికపాటి వస్తువులను గాలిలో ఎగురవేసేవారు. అవే పతంగుల పుట్టుకకు కారణమయ్యాయి. రాజస్థాన్‌లోని అల్వర్‌కు చెందిన మౌజీ 1872లో మొదటగా పిల్లల సరదా కోసం పతంగాన్ని ఎగురవేసినట్లు చెబుతారు. అలా ఉత్తరాదిలో పుట్టిన పతంగి దక్షిణాది సంస్కృతిలో భాగమైపోయిందని కథనం. మొఘలులు సైతం పతంగులపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారని చరిత్రకారులు చెబుతున్నారు. రాకుమార్తెలు, రాజులు తమ ప్రేమ సందేశాన్ని పంపే సాధనాలుగా వీటిని ఉపయోగించేవారని పేర్కొంటున్నారు.

పోటాపోటీగా పేంచీలు

గగనతలంలో విహరిస్తున్న గాలిపటానికి పేంచీ వేసి, ఓడించడం ఓ ప్రత్యేకత. ప్రత్యర్థి గాలిపటం ధాటికి తట్టుకోవడానికి గట్టి కరుకుదనం కలిగిన మాంజాను ఉపయోగిస్తారు. పేంచీ వేసి, అవతలి వ్యక్తి పతంగి గాలిలో ఎగిరిపోతుంటే(అఫ్సా) ఎంతగానో ఆనందిస్తుంటారు. అఫ్సా అయిన గాలిపటాన్ని చేజిక్కించుకోవడానికి చిన్నారులు, యువకులు పరుగెత్తుతుంటారు.

పలు రంగులు, చక్కని ఆకృతితో..

రాత్రి సమయంలోనే ఆకాశంలో నక్షత్రాలు కనిపిస్తాయి. కానీ సంక్రాంతి వచ్చిందంటే పగలు సైతం నక్షత్రాల వలే పతంగులు దర్శనమిస్తాయి. పలు రంగులు, చక్కని ఆకృతితో ఆకట్టుకునేలా (సినీనటులు, కార్టూన్లు, రాజకీయ నాయకుల చిత్రాలు, చార్మినార్, సీతాకోకచిలుక, చేపల ఆకారంలో) ఉన్న పతంగులు మార్కెట్లో విరివిగా లభిస్తున్నాయి. చిన్నారులను ప్రత్యేకంగా ఆకర్షించేలా ఫిష్‌కటింగ్, చోటాభీమ్, బెన్‌టెన్, యాంగ్రీబర్డ్స్, డోరెమాన్, బాహుబలి వంటి గాలిపటాలు అందుబాటులోకి వచ్చాయి.

సూర్యకిరణాలతో లాభం..

సంక్రాంతి సందర్భంగా సూర్యుడు మకర రాశిలోకి మారుతుంటాడు. ఈ సమయంలో మానవ శరీరంపై భానుని కిరణాలు పడితే వ్యాధి నిరోధక శక్తి పెరిగి, రోగాలను దరిచేయనీయవు.

మాంజా, పతంగుల ధరలు..

పతంగులను ఎగురవేసేందుకు వినియోగించే చైనా మాంజా ఇప్పుడు లభించడం లేదు. వాడొద్దని ప్రభుత్వం నిషేధం విధించింది. పతంగుల పరిమాణం, నాణ్యత, రంగులను బట్టి ధరలు ఉన్నాయి. రూ.5 నుంచి రూ.100 లోపు గాలిపటాలు, రూ.10 నుంచి రూ.300 వరకు మాంజా లభ్యమవుతున్నాయి.

పలు విషాద ఘటనలు..

- హైదరాబాద్ అత్తాపూర్‌లో శనివారం స్నేహితులతో కలిగి గాలిపటం ఎగురవేయడానికి మేడపైకి వెళ్లిన తనిష్క్ (11) విద్యుత్‌షాక్‌తో చనిపోయాడు.
- పాత మంచిర్యాలలోని రాళ్లవాగు బ్రిడ్జి పై రెండేళ్ల క్రితం చైనామాంజాకు తగిలి పస్తం భీమయ్య (40) అనే వలస కూలీ మృతి చెందాడు.
- గతేడాది నల్గొండలో భార్యతో కలిసి ఓ కూలి తన మోపెడ్‌పై వెళ్తుండగా, చైనా మాంజా తగిలి గొంతును కోయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- నాలుగేళ్ల క్రితం ఢిల్లీలో ఓ వ్యక్తి తన ఇద్దరు పిల్లలను కారులో తీసుకెళ్తుండగా విండో నుంచి బయటకు చూస్తున్న ఆ పిల్లల గొంతును చైనా మాంజా కోయడంతో ఇద్దరూ చనిపోయారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- గాలిపటాన్ని వీలైనంత వరకు మైదానానికి వెళ్లి ఎగురవేయాలి.
- మేడపై, ఓవర్‌హెడ్ ట్యాంకులు, చెట్లపైకి ఎక్కి పతంగి ఎగురవేయడం అత్యంత ప్రమాదకరం.
- విద్యుత్ తీగలకు పతంగి తగలనీయరాదు. పొరపాటున వాటికి చిక్కుకున్నా తీయొద్దు.
- చెట్లపై చిక్కుకున్న పతంగిని కొమ్మపై ఎక్కి తీయడం ప్రమాదకరం.
- దారం తెగి ఎగిరిపోతున్న పతంగిని పట్టుకోవడానికి వీధుల్లో, రహదారులపై పరుగెత్తవద్దు. వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.
- రైలు పట్టాల సమీపంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పతంగిని ఎగురవేయవద్దు.
- చైనా మాంజాను వినియోగించవద్దు. దానితో పక్షుల పాణాలకు ప్రమాదం ఉంది.

రెండు రోజుల ముందునుంచే..



సంక్రాంతికి రెండు రోజుల ముందునుంచే మేము మా ఇంటి డాబాపై పతంగులను ఎగురవేయడం ప్రారంభిస్తాం. నిజామాబాద్‌లోని ఇంట్లో అందరం కలిసి కైట్ ఫెస్టివల్ జరుపుకుంటాం. – చల్ల స్వరూపారాణి, డిప్యూటీ మేయర్, కరీంనగర్

నాన్నతో పోటీ పడతా..



చిన్నప్పటి నుంచి పతంగులు ఎగురవేయడమంటే ఇష్టం. సంక్రాంతి వచ్చిందంటే నాన్నతో కలిసి ఇంటి డాబాపై ఎగురవేస్తూ ఎంజాయ్ చేస్తా. నాన్నతో పోటీ పడటం సంతోషాన్నిస్తుంది. – పడాల రిషితాప్రసాద్, మెడికో, జగిత్యాల

ఫ్రెండ్స్‌తో కలిసి ఎగురవేస్తా



ప్రతీ సంక్రాంతికి నేను మా ఫ్రెండ్స్‌తో కలిసి పతంగులు ఎగురవేస్తా. పొద్దున ఇంటి ముందు ముగ్గులు వేశాక గాలిపటాలతో ఆడుకుంటాం. చాలా ఆనందంగా ఉంటుంది. – గుర్రం హరిణి, చొప్పదండి

కోరిన డిజైన్లలో..



కోరిన డిజైన్లలో పతంగులకు ఆర్డర్ ఇచ్చి, తెప్పిస్తున్నాం. సిరిసిల్ల పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మావద్దే కొనుగోలు చేస్తారు. అందరికీ అందుబాటు ధరల్లో విక్రయిస్తున్నాం. – ఎలగందుల రమేశ్, చిరువ్యాపారి, సిరిసిల్ల

ప్రజల్లో అవగాహన రావాలి



నిషేధిత మాంజాను వాడకూడదని ప్రజల్లో అవగాహన రావాలి. వన్యప్రాణుల కోసం క్లినిక్ నిర్వహిస్తున్నాం. జీవాలకు ఆపాయం కలిగితే 96978 87888కు ఫోన్ చేయాలి. – ప్రదీప్ పరకుత్, రాష్ట్ర అధ్యక్షుడు, యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ, గోదావరిఖని

చైనా మాంజా ప్రమాదకరం



జగిత్యాల క్రైం: గాలిపటాలు ఎగురవేసేందుకు చైనా మాంజాను వినియోగించడం ప్రమాదకరం. ఇది పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తుంది. రాష్ట్రంలో ఈ మాంజా పూర్తిగా నిషేధించబడింది. – సన్‌ప్రీత్‌సింగ్, జగిత్యాల ఎస్పీ



'ఉపయోగంలోకి తెస్తాం'

కోరుట్ల: పట్టణంలో నిరుపయోగంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం, షాదీఖానాను ఉపయోగంలోకి తెస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం మున్సిపల్ అధికారులతో కలిసి వాటిని పరిశీలించారు. మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు హయాంలో కల్యాణ మండపం, షాదీఖానాకు నిధులు మంజూరు చేయించారన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడంతో కొన్ని పనులు మిగిలి నిరుపయోగంగా మారాయన్నారు. మిగిలిన పనుల కోసం నిధులు మంజూరు చేయించి వాటిని వినియోగంలోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్‌గౌడ్, సదానందాచారి తదితరులు పాల్గొన్నారు.